క్లుప్తంగా

స్వచ్ఛందంగా రోడ్డు ఏర్పాటు



ఈపూరు: గ్రామస్తుల సహకారంతో సర్పంచ్ ఆధ్వర్యంలో మండలంలోని కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామంలో స్వచ్ఛందంగా రోడ్డును ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలోని చెరువు వద్ద నుంచి పోలేరమ్మ గుడి వరకు సుమారు కిలోమీటరు మేర 10 సంవత్సరాల నుంచి అస్తవ్యస్తంగా ఉండటంతో అప్పటి ప్రభుత్వ అధికారులు కాని, పాలకులు కాని పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ ప్రజలు, సర్పంచ్ చిందుకూరి కోటేశ్వరరావు కొండమ్మ ఆధ్వర్యంలో యంత్రాలతో రోడ్డు వేస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ఈ రోడ్డు నిర్మాణంతో హర్షం వెలిబుచ్చారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

బొల్లాపల్లి: పొలం కౌలుకు తీసుకొని సాగుచేసే ప్రతిఒక్క రైతు గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కౌలుదారు కార్డులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్క కౌలు రైతుకు పంట సాగు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డు జారీ చేయడంలో అధికారులు పారదర్శకంగా, సరళంగా వ్యవహరించాలని సూచించారు. పొలం యజమానులను, కౌలుదారులను ఇబ్బంది పెట్టకుండా కార్డు త్వరితగతిన మంజూరు చేయాలని చెప్పారు. కౌలుదారు కార్డు జారీపై యజమానులకు ఎలాంటి సందేహాలు, అపోహలు వద్దని, జారీ చేసిన కార్డు 11 నెలలు మాత్రమే చెల్లుబాటు అవుతుందని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, ఏఓ ఎ.అంకారావు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్ష

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం పురోగతిపై సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 10,298 లబ్ధిదారులకు గాను 8402 మంది లబ్ధిదారులను రెన్యూవల్స్ చేయాల్సి ఉండగా 8283 మందిని వలంటీర్లు యాప్‌లో నమోదు చేశారన్నారు. అలాగే నూతనంగా ఈఏడాదిలో 1892 మందిని గుర్తించగా 524 మందిని నమోదు చేశారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో అర్హత లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల పురోగతి వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాల ఆధారంగా జియోటాగింగ్ విధానంలో బిల్లులు పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. ఈసదస్సులో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆళ్ళ యుగంధర్, కొమటినేని అశోక్‌చౌదరి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతల స్వీకారం

బొల్లాపల్లి: ఈఓపీఆర్‌డీ షేక్ జిలానీ బాషా మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (పూర్తి అదనపు బాధ్యతలు) సోమవారం చేపట్టారు. గతంలో ఇన్‌చార్జిగా వ్యవహరించిన టి.పార్వతి వట్టిచెరుకూరు మండలం బదిలీ అయ్యారు. నూజెండ్ల మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న జిలానీ బాషా బొల్లాపల్లికి బదిలీపై వచ్చారు. రెంటచింతల మండలం నుంచి ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన గౌసియా బేగం సెలవుపై వెళ్లడంతో ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టినట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.

కనపర్రు వీఆర్‌ఓగా మురళీకృష్ణ

నాదెండ్ల: మండలంలోని కనపర్రు వీఆర్‌ఓగా వి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పిడుగురాళ్ల మండలం కొత్తగణేశునిపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన జి.వెంకటరమణ తన యథాస్థానమైన గణపవరం 1వ సచివాలయానికి రిలీవ్ అయ్యారు. గణపవరం 2లో పని చేస్తున్న డి.మరియదాసు సత్తెనపల్లి మండలం అబ్బూరుకు బదిలీ అయ్యారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎం.అనురాధ తెలిపారు. వినుకొండ మున్సిపాలిటీ హనుమాన్‌నగర్ (బీసీ–ఈ), వినుకొండ రూరల్ మండలంలోని కొప్పుకొండ ఓసీ–1 (జనరల్), గోకనకొండ–2 (జనరల్), శావల్యాపురం మండలం కొత్తలూరు తుమ్మలకుంట (ఎస్సీ) సెంటర్లలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన 21 నుంచి 35 సంవత్సరాల వయసు గల వివాహితులై ఉండాలని, అభ్యర్థి స్థానికంగా నివాసం ఉండాలన్నారు. సంబంధిత పత్రాలతో ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

'జగనన్న ఆణిముత్యాలు' కు సన్మానం



వెల్లటూరులో సన్మానం పొందిన విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి గాను 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలులో భాగంగా సోమవారం ఘనంగా సత్కరించారు. దండ తేజశ్రీ, సభావత్ కార్తీక్ నాయక్ 567, పి.శ్రీవాణి ఎ.సృజనశ్రీ 554, కె.గంగోత్రి 541 మార్కులు సాధించినందుకు గాను జగనన్న ఆణిముత్యాలులో భాగంగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెడల్స్ అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుర్నాథం, సర్పంచ్ చినవీరయ్య, ఎంపీటీసీ జి.చినవెంకయ్య, పాఠశాల హెచ్‌ఎం ఎ.పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన 10వ తరగతి విద్యార్థినులను తహసీల్దార్ కిరణ్‌కుమార్ మెడల్స్, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు శ్రీవాణి, నీలిమ, ఆర్.సౌమ్యలకు తహసీల్దార్ బహుమతులు అందజేశారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగించుకొని మంచి మార్కులు సాధించాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు



విద్యార్థిని అబ్బూరి తులసికి మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అబ్బూరి తులసి అనే విద్యార్థినికి రూ.3 వేల నగదుతో పాటు గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యేశ్వరరావు, కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరి, గ్రామ పెద్దలు చీమల శ్రీనివాసరెడ్డి, ఓర్సు కోటేశ్వరరావు, డాక్టర్ మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రత్యేక ఆపరేషన్లు

- ప్రాణాప్రాయం నుంచి బయటపడిన వైనం
- వైద్యులను అభినందించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ఇద్దరు చిన్నారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన ఆపరేషన్లను విజయవంతం చేసి వారి సమస్యను తీర్చిన భారతీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం, జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అభినందించారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిపురం గ్రామానికి చెందిన అచ్చయ్య కుమారుడు పదేళ్ల మోహన్ సందీప్‌కు పుట్టుకతోనే ప్రేగులో నరాలు లేక పోవడంతో మోషన్ పాస్ చేసే గొట్టం ద్వారా మలం కిందకు రావడం లేదు. పొట్ట బాగా ఉబ్బి అనారోగ్యానికి గురయ్యాడు. గుంటూరు వైద్యుల సూచన మేరకు మూడు నెలలు వయస్సులో ఒక ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి ఆ బాబుకు పొట్ట పక్క నుంచి మలం విసర్జనతో అనేక ఇబ్బందులు పడేవారు. ఇది గమనించిన తల్లిదండ్రులు మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలవగా, మెరుగైన వైద్యం అందించే చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీలకు ఆయన సూచించారు. ఆమె భారతీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్‌ను ఉచితంగా చేయించారు. పోస్ట్ ఆపరేషన్ సమస్యలు ఎక్కువగా ఉంటాయని చాలా వరకు వైద్యులు ముందుకు రాకపోవడంతో విజయవాడ నుంచి స్పెషాలిటీ వైద్యుల్ని పిలిపించారు. వారితో భారతీ హాస్పిటల్ వైద్యులు కలిసి 'డుహామిస్ పుల్ త్రూ' అనే అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు.



బాలుడు, తల్లిని అభినందిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ

ఐదేళ్లకు పాపకు కూడా...

సత్తెనపల్లికి చెందిన అవుల పల్లవి అనే ఐదేళ్ల పాపకు కూడా ఇదే విధంగా పుట్టుకతో మోషన్ రావాల్సిన గొట్టం ద్వారా రాకుండా మానంలో నుంచి వస్తోంది. ఆ పాపకు జిల్లా కలెక్టర్ శివశంకర్ తక్షణమే రూ.5 వేలు ఆర్థిక సాయం అందించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం ఉచితంగా అందేలా చూడమని డాక్టర్ సునీలను ఆదేశించారు. భారతీ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఆరోగ్యశ్రీ ద్వారా 'లూప్‌కొలాస్టమి' అనే అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా ఉచితంగా చేసి వారి బాధలు తొలగించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ అరుదైన ఆపరేషన్ విజయవంతం చేసినందుకు గాను భారతీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ సునీలను అభినందించారు.

ఆటో, కారు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

మరో ఇద్దరికి స్వల్పగాయాలు

వినుకొండ(నూజెండ్ల): ఆటో, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన వినుకొండ సమీపంలోని పసుపులేరు బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ నుంచి దొనకొండ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్కాపురం నుంచి వినుకొండ వస్తున్న కారు పసుపులేరు బ్రిడ్జి సమీపంలో మూలమలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో తిరగబడటంతో ఆటో డ్రైవర్ పి.సురేష్, శేషయ్యలకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వినుకొండ పట్టణ సీఐ సాంబశివరావు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌లు సంఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ సాంబశివరావు

ఆర్టీసీ కార్మికుల గేట్ మీటింగ్

నరసరావుపేట: డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా సోమవారం ఏపీ పీడీటీ ఎంప్లాయీస్ యూనియన్ నరసరావుపేట డిపో కమిటీ ఆధ్వర్యంలో ఐదవ రోజు నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపో అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా, జోన్ స్థాయి నాయకులు హాజరయ్యారు. డిపో కార్యదర్శి షేక్ జాని మాట్లాడుతూ ప్రత్యేకించి డిపోలో ఉన్న సమస్యలను సభ్యుల ముందు ప్రస్తావించారు. ఏడీసీలపై పని భారాన్ని పెంచి మానసికంగా ఇబ్బంది కలుగచేస్తున్నారని, అక్రమ చార్జిషీట్లను రద్దు చేయాలని, సీనియార్టీ ప్రకారంగా ఓడీలను ఏర్పాటు చేయాలని, మహిళలకు యాజమాన్యం కేటాయించిన మూడు రోజుల ప్రత్యేక సెలవు కాకుండా, అదనంగా ఒక్కరోజు కూడా సెలవు మంజూరు చేయొద్దని యాజమాన్యం ఇబ్బంది పెట్టే వైఖరిని వ్యతిరేకిస్తున్నామన్నారు.



బస్టాండ్ ఆవరణలో ఎస్‌బీఐ ఏటీఎం

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎంను బ్యాంకు డీజీఎం దినేష్, జనరల్ మేనేజర్ రెహమాన్, ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వీరాస్వామిలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం రామకుమార్ మాట్లాడుతూ ప్రయాణికులు, బస్టాండ్ సమీపంలోని ప్రజల సౌకర్యం కోసం త్వరితగతిన నగదును సేకరించేందుకు ఏటీఎంను ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన మిషన్‌లో ఎలాంటి ఏటీఎం కార్డ్ లేకుండా నగదును వేయవచ్చు, తీయవచ్చుని పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాంకు కస్టమర్లు బ్యాంకుకు సంబంధించిన యాప్ ద్వారా నగదును సేకరించవచ్చని తెలిపారు.



కార్యక్రమంలో మెయిన్ బ్రాంచ్ మేనేజర్ స్వామి, ఏటీఎం అసిస్టెంట్ మేనేజర్ కృష్ణమూర్తి, చీఫ్ మేనేజర్ మాధవి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయపాలెంలో అగ్నిప్రమాదం

వరిగడ్డి దగ్ధం

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామం పరిధిలో వడ్డిగడ్డివామి దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే...సంగం గోపాలపురం వెళ్లే మార్గంలోని రైస్‌మిల్లు సమీపంలో రోడ్డు వెంబడే ఉన్న 3 ఎకరాల వరిగడ్డి వామి నుంచి మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కేంద్రాధికారి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే బోయపాలెంకు చెందిన షేక్ దరియావలికి చెందిన రూ.50వేల విలువైన 3 ఎకరాల ఎండుగడ్డి వామి కాలిబూడిదైంది. అయితే దీనికి ఆనుకునే మరో రూ.75వేల విలువైన గడ్డివామిని మంటలు అంటుకోకుండా సిబ్బంది రక్షణ చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదం సంభవించనకు కొద్దిదూరంలోనే భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు, నూలుమిల్లు కూడా ఉన్నాయని సకాలంలో సిబ్బంది వచ్చి మంటల్ని అదుపులోకి తేవడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి సిగిరెట్ కాల్చి గడ్డివామి వద్ద పడేసినందునే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

బాలలతో పనులు చేయించడం నేరం

రొంపిచర్ల: బాల కార్మిక వ్యవస్థను నిలువరిస్తేనే నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధ్యమని ప్యానల్ న్యాయవాదులు అచ్చి ఏడుకొండలు, శ్రీరామినేని ప్రసాద్‌లు పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి ఒ.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని విప్పర్ల గ్రామ సచివాలయంలో బాల కార్మిక నిర్మూలన చట్టంపై నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు పారా లీగల్ వలంటీర్ గోదా రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను పనులకు పంపకూడదన్నారు. అలా పనులు చేయించే సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పారా లీగల్ వలంటీర్ గోదా సందీప్ కుమార్, సర్పంచ్ జి.సీతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు టి.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ కె.బాలచౌడమ్మ, లక్ష్మీభారతి, నన్నమ్మ, రమాదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



చిలకలూరిపేటటౌన్: వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. ఈ నెల 24వ తేదీ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పుట్టిన రోజు పురస్కరించుకొని పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న ప్రశాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం గత మూడు రోజుల నుంచి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం మంత్రి విడదల రజిని జన్మదినం వరకు కొనసాగిస్తామన్నారు. సొసైటీ చైర్మన్ కొండవీటి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకుడు తాళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

చిలకలూరిపేటటౌన్: మద్యం మత్తులో వ్యక్తి, మరో వ్యక్తిని గాయపరిచిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాటిమీద ప్రాంతానికి చెందిన గద్దం నాగార్జున ఈ నెల 17వ తేదీ సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి ఆరుబయట మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన బాలసాయి అటువైపు వెళుతూ తన గురించే మాట్లాడుతున్నాడని భావించి నాగార్జునతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం మద్యం సేవించి వారి ఇంటికి వెళ్లి రాయితో నాగార్జున తలమీద కొట్టాడు. దాడిలో తీవ్ర గాయాలైన నాగార్జునను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ల చోరీ

అమరావతి: అమరావతి జగనన్న కాలనీ లేఅవుట్–3లో రెండు రోజులలో విద్యుత్ నీటి మోటార్లు, ఇనుప వస్తువులు చోరీకి గురయ్యాయి. జగనన్న కాలనీలో నీటి వసతి కోసం కె.భారతీలక్ష్మి, వల్లూరు చిట్టెమ్మలతో పాటు మరికొందరు సొంతంగా ఖర్చు పెట్టుకుని బోర్‌లు తవ్వించటం జరిగింది. ఈక్రమంలో శనివారం, ఆదివారాలలో రాత్రిపూట కాలనీలో ఎవరు లేక పోవటంతో బోర్‌పంపులలో ప్లాస్టిక్ పైపులను వెలికి తీసి వాటికి బిగించి ఉన్న సబ్‌మెర్సిబుల్ మోటార్లను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. ఘటనపై బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీరు పోకుండా తూములకు అడ్డేశారయ్యా !

స్పందనలో ఉన్నవ గ్రామ రైతులు ఫిర్యాదు

యడ్లపాడు: చెరువు భూముల్ని ఆక్రమించుకోవడంతో పాటు ఎగువ పంట పొలాల గుండా వచ్చేవర్షం, వరద నీటిని వెళ్లే మార్గాన్ని మూసేసి రైతుల్ని ఆటంక పరుస్తున్నారంటూ ఉన్నవ గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు అధికారులకు తమగోడును వినిపించారు. ఉన్నవ గ్రామానికి ఉత్తరాన ఉన్న 89, 93, 95 సర్వే నంబర్లలోని పంట పొలాల్లో కురిసిన వర్షపు నీరు, ఎగువ నుంచి పారే వరద నీరు డొంకమార్గాన ప్రవహిస్తూ 84 కసి నీటి చెరువులోకి వెళ్లి కలుస్తాయి. తమ పంట పొలాల నుంచి చెరువుకు వెళ్లే డొంకమార్గంలో కొద్ది కాలం కిందట మట్టిరోడ్డు ఆ తరువాత మెటల్ రోడ్డును ఏర్పాటు చేశారని, ఎగువ పొలాల నుంచి వచ్చే వర్షం, వరద నీరు పోయేలా రోడ్డు కింద తూముల్ని సైతం ఏర్పాటు చేశారన్నారు. గ్రామానికి చెందిన కొందరు చెరువును ఆక్రమించుకుని వర్షపు నీరు వెళ్లే తూముల్ని పూడ్చేసినట్లు ఆరోపించారు. దీంతో సాగు సమయంలో వర్షం కురిస్తే నీరు తమ పొలాల్లోనే నిలిచి పంటనష్టపోయే ప్రమాదం ఉందని...అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయా అంశాలతో కూడిన ఫిర్యాదు, స్థానిక సమస్యను తెలిపే ఫొటోలను తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. ఫిర్యాదులో సంతకాలు చేసిన వారిలో రైతులు ఆర్.రోశయ్య, సామినేని శ్రీనివాసరావు, తోకల కోటేశ్వరమ్మ, టి.సాంబయ్య, కళ్లి కోటేశ్వరరావు ఉన్నారు.



తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరావుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

అఖండ జ్యోతి ప్రజ్వలన ఏర్పాట్లపై సమీక్ష

వినుకొండ టౌన్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న వినుకొండ కొండపై జరగనున్న అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి సంబంధించిన పనులను, అన్నసంతర్పణ స్థలాన్ని హిమాలయ గురూజీ పరిశీలించారు. వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొండపై గల అఖండ జ్యోతి వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హిమాలయ గురూజీ మాట్లాడుతూ తొలిఏకాదశి పర్వదినం నాడు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమాలలో భాగంగా స్వస్తి పుణ్యాహవచనం, జ్యోతి ప్రక్షాళన, మండప దేవతారాధన, రామలింగేశ్వర స్వామివారికి విశేష ద్రవ్యాల అభిషేకాలు, రుద్రసహిత చండీహోమం, మహాపూర్ణాహుతి, పట్టణంలోని బోసుబొమ్మ సెంటరులోని శివాలయం వద్ద నుంచి కొండపైకి పార్వతీపరమేశ్వరుల పల్లకీ సేవ, వేద పండితులచే వేద ఘోష, మహిళలచే విశేష హరతులు, ప్రవచన కార్యక్రమంతోపాటు సాయంత్రం 6.30 కు అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని వేద మంత్రాలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. డాక్టర్ ఆనంద్ కుమార్ నాయుడు, జెట్టి శ్రీనివాసరావు, శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న హిమాలయ గురూజీ, శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు, వీహెచ్‌పీ సభ్యులు

ఎంఈఓ-2 గా కె.పార్వతి బాధ్యతలు స్వీకరణ



పార్వతి



లలిత కుమారి



కృష్ణారెడ్డి

బొల్లాపల్లి: వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.పార్వతి మండల విద్యాశాఖ అధికారి–2గా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతి పొంది బదిలీపై వెల్లటూరు హైస్కూల్ హెచ్‌ఎంగా విధుల్లో చేరారు. సీనియర్టీపై ఎంఈవో 2గా నియామకం పొందినట్లు ఈ మేరకు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

యడ్లపాడు ఎంఈఓ–2 బాధ్యతలు..

యడ్లపాడు: యడ్లపాడు ఎంఈఓ –2గా నియమితులైన ఎస్.అరుణ కుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఆమె మండల ఇన్‌చార్జి ఎంఈఓ ఐ.ఆంజనేయులకు తన నియామక పత్రాన్ని అందించి సంతకం చేసి విధుల్లోకి చేరారు. గతంలో చిలకలూరిపేటలోని శారదా జెడ్పీ, ప్రస్తుతం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఎంఈఓ–2గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఎంఈఓ–2గా కృష్ణారెడ్డి బాధ్యతలు..

నాదెండ్ల: మండల విద్యావనరుల కేంద్రం ఎంఈఓ–2 ఇ.కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిలకలూరిపేట శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈఓ–2 లలితకుమారి బాధ్యతలు స్వీకరణ ...

శావల్యాపురం: ఎంఈఓ–2 గా పుసులూరి లలితకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల మండలం తేలుకుట్ల గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న లలితకుమారి ఎంఈఓ–2 నియమాకం అయి బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ–2 లలితాకుమారి ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డి.రవికుమార్, కార్యాలయ సిబ్బంది లింగాల శ్రీహరి, తివిక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో మహిళ అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు సోమవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు చిత్రాలయ టాకీస్ వద్ద దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న గోనెపూడి గ్రామానికి చెందిన సీలం చెంచమ్మను అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.